# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

సోమవారం 10-7-2023

వైబ్రెంట్ ఎడిషన్ 4pm

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial


## ఎవరూ బయటకు రావొద్దు

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 10)**


భారీ వర్షాలతో హిమాచల్ ప్రదేశ్ అతలాకుతలం అవుతోంది. భారీ వర్షాల కారణంగా వరద ముంచెత్తెడంతో ఇప్పటికే భారీ నష్టం వాటిల్లింది. రానున్న 24 గంటలపాటు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. స్వయంగా ఆ రాష్ట్ర సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు మాట్లాడుతూ రానున్న 24 గంటలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా ఇళ్లలోనే ఉండాలని కోరారు. భారీ వర్షాలు కురుస్తుండడంతో అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటికి రావద్దని సూచించారు. అలాగే మూడు హెల్ప్ లైన్ నంబర్లను కూడా ప్రకటించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 1100, 1070, 1077 నంబర్లకు ఫోన్ చేయాలాని తెలిపారు.

## అంబారీపై అమ్మ

### అంగరంగ వైభవంగా బోనాలు

**తెలుగుప్రభ, సికింద్రాబాద్ (జూలై 10)**


**శివసత్తుల సందడి, పోతరాజుల విన్యాసాలు, ఫలహార బండ్ల ఊరేగింపు, సాంస్కృతిక ప్రదర్శనలతో సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి అమ్మవారి బోనాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం రంగం కార్యక్రమం జరిగింది. అనంతరం అమ్మవారు అంబారీపై పుర వీధుల్లో ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.**



## లేటెస్ట్ న్యూస్

## అదే సీఎం కేసీఆర్ లక్ష్యం : మంత్రి తలసాని

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 10)**



రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించడంతో పాటు, మత్స్యకారులను ధనవంతులుగా చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బేగంపేటలోని హరిత ప్లాజా లో నిర్వహించిన జాతీయ మత్స్యకారుల దినోత్సవం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో మత్స్యకారుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చెరువులపై మత్స్యకారులకే పూర్తి హక్కులు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచితంగా చేప, రొయ్య పిల్లలను పంపిణీ చేస్తున్నది తెలంగాణ ప్రభుత్వమే అన్నారు. రాష్ట్రం లో గణనీయంగా మత్స్య సంపద పెరుగుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో చేపలను ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ చేరుకుంటుందని స్పష్టం చేశారు. ఇదతంతా సీఎం కేసీఆర్ దూరదృష్టి వల్లే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## అల్వాల్ పరిధిలో షాకింగ్ న్యూస్

### బతికున్న వ్యక్తిని చంపేశారు..

**తెలుగుప్రభ, అల్వాల్ (జూలై 10)**

సోషల్‌మీడియా పుణ్యమా అని చిత్ర, విచిత్ర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా బతికున్న వ్యక్తిని చంపేస్తూ ఓ వార్త వైరల్ కావడంతో అది చూసిన అతడి భార్య ఆస్పత్రి పాలైంది. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణమైన సంఘటన వెలుగుచూసింది. బతికుండగానే ఓ వ్యక్తిని చంపేశారు. గణేష్ అనే వ్యక్తి చనిపోయినట్లు సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. బాధితుడు అదే సమయంలో ఇంట్లో లేకపోవడంతో భార్య నిజమేనని నమ్మేసింది. భర్త నిజగానే చనిపోయాడు అనుకుని గణేష్ భార్య షాక్‌కు గురై కుప్పకూలిపోయింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. మరోవైపు బాధితుడు గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అభిషేక్ బెనర్జీకి చుక్కెదురు..

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 10)**




టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ సమీప బంధువు అభిషేక్ బెనర్జీకి సుప్రీంకోర్టులో సోమవారం చుక్కెదురైంది. టీచర్స్ రిక్రూట్‌మెంట్ కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును ఆపడానికి కలకత్తా హైకోర్టు తిరస్కరించడాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. హైకోర్టు ఆదేశాలపై ఆయన చేసిన అపీలును తోసిపుచ్చింది. అభిషేక్ పిటిషన్‌పై విచారణ జరిపిన కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, రాజకీయంగా సున్నితమైన కేసులను తన ధర్మాసనం విచారించి, తీర్పులిస్తోందని అన్నారు. దీంతో ఈ పిటిషన్‌ను వేరొక ధర్మాసనానికి అప్పగించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంకోర్టు ఏప్రిల్ 28న ఆదేశించింది. దీంతో ఆయన పిటిషన్‌ను జస్టిస్ అమృత సిన్హా ధర్మాసనానికి అప్పగించారు. జస్టిస్ సిన్హా ఈ పిటిషన్‌పై విచారణ జరిపి, మే 18న తోసిపుచ్చారు. దీనిపై ఆయన సుప్రీంకోర్టులో అపీలు చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం వ్యక్తులపై దర్యాప్తు చేసే అధికారం తమకు ఉందని ఈడీ వాదించింది. విచారణకు హాజరుకావాలని అభిషేక్‌ను ఇటీవల ఆదేశించింది. ఈ కుంభకోణానికి సంబంధించిన కేసులో మాజీ విద్యా శాఖ మంత్రి పార్థ ఛటర్జీ, ఆయన సన్నిహితురాలు అర్పిత ముఖర్జీ, మరికొందరు ఉన్నతాధికారులు ఇప్పటికే అరెస్టయ్యారు.

## ఆ రెండు పార్టీలు చేసిందేమీ లేదు

### - మంత్రి హరీశ్‌రావు ధ్వజం

**తెలుగుప్రభ, సంగారెడ్డి (జూలై 10)**



మంత్రి హరీశ్‌రావు విపక్ష పార్టీలపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. తెలంగాణకు భారతీయ జనతా పార్టీ ఇచ్చింది లేదు.. కాంగ్రెస్ పార్టీ చేసింది లేదు అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పటాన్‌చెరులో ఆర్ అండ బీ గెస్ట్ హౌజ్, ఫ్రీడం పార్కులను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతు బంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్స్ వంటి పథకాలు ఉన్నాయా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రిజెక్టెడ లీడర్లు, స్క్రాప్ లీడర్లు జాయిన్ అయితే పోయేది లేదు. బీజేపీ, కాంగ్రెస్ ఎన్ని ట్రిక్కులు చేసినా, హ్యాట్రిక్ కొట్టేది బీఆర్ఎస్ మాత్రమేనని తేల్చిచెప్పారు. ప్రతిపక్షాలు అధ్యక్షులను మార్చినా, ఔట్ డేటెడ లీడర్లకు పట్టం కట్టినా బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం తథ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం అడిగింది ఇవ్వకుండా, అసలు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా మోసం చేసింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. జేపీ దక్షిణాది రాష్ట్రాలకు ఏమైనా ఇచ్చిందా అంటే అది కేవలం శుష్కప్రియాలు, శూన్య హస్తాలు మాత్రమే అని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.



## వామ్మో.. కారులోంచి అలకస్మాత్తుగా మంటలు

### దూకేసిన యువకులు

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 10)**

ఆ యువకులకు తృటిలో ప్రమాదం తప్పింది. ఊహించని ప్రమాదం నుంచి తప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. కాకపోతే ఖరీదైన కారు మంటలకు ఆహుతైంది. నగరంలోని ఫిల్మ్‌నగర్‌లో వేగంగా వెళ్తున్న కారులో మంటలు చెలరేగడం కలకలం రేపింది. సోమవారం ఉదయం ఈ ఘటన జరిగింది. అకస్మాత్తుగా కారులో మంటలు చెలరేగడంతో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు ప్రమాదాన్ని గ్రహించి వెంటనే కిందకు దూకేశారు. ఈ ఘటనలో కారు పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. స్వల్ప గాయాలపాలైన ఇద్దరు యువకులను ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అయితే ప్రమాదానికి గల కారణాలు, యువకుల వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆ ఇద్దరికీ భారీ భద్రత





### కేంద్ర హోంశాఖ కీలక నిర్ణయం

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 10)**

బీజేపీ ప్రముఖ నేతలకు కేంద్ర హోం శాఖ భారీ భద్రత కల్పించింది. తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ బీజేపీ ఎన్నికల కమిటీ ఛైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు కేంద్ర ప్రభుత్వం సెక్యూరిటీ కల్పించాలని నిర్ణయించింది. ఇక నుంచి వారిద్దరికి కేంద్ర బలగాలు సెక్యూరిటీ కల్పించనున్నాయి. ఈటలకు వై ప్లస్ కేటగిరీ, అర్వింద్‌కు వై కేటగిరీ భద్రతను ఇవ్వాలని కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో వీరిద్దరూ సీఎఆర్పీఎఫ్ భద్రత పరిధిలోకి వెళ్లనున్నారు. అలాగే ఇద్దరు నేతలకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు కూడా కేటాయించనున్నారు.

అర్వింద్‌కు ఒక కమాండోతో సహా 8 మందిని, ఈటలకు ఇద్దరు కామండోలతో సహా 11 మంది భద్రతా సిబ్బందిని కేటాయించనున్నారు. ఇప్పటికే కేంద్ర హోంశాఖ ఆదేశాలతో సీఆర్పీఎఫ్, ఐజీ బృందంతో పాటు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, రాష్ట్ర ఎస్బీ అధికారులు ఈటల, అర్వింద్ ఇళ్లను తనిఖీ చేశారు. అనంతరం వారితో సమావేశమై భద్రత గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారుల బృందం రిపోర్ట్ తర్వాత కేంద్రం హోంశాఖ తుది ఉత్తర్వులు జారీ చేయనుంది. కానీ ఈటలను హత్య చేయాల్సిన అవసరం తనకు లేదని, ఆయనే తనను హత్య చేయిండానికి ప్రయత్నాలు చేస్తున్నారని కౌశిక్ రెడ్డి చెబుతున్నారు.

## కేసీఆర్ పాలనలోనే సాధ్యం : మంత్రి ఎర్రబెల్లి

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 10)**



ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. తానా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. తనా మహాసభలు ప్రత్యేకమైనవని, మనం ఎక్కడున్నా అంతా ఒక్కటే అని చాటుతున్నాయని ఎర్రబెల్లి అన్నారు. ప్రవాసులు స్వదేశం, రాష్ట్రాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అందరం కలిసి తెలుగు రాష్ట్రాలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దగలమని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ప్రవాసులు గర్విస్తున్నారని ఎర్రబెల్లి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని వ్యాఖ్యానించారు. సమావేశంలో తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీఆర్ఎస్ నేత కర్నె ప్రభాకర్, ప్రవాస నేతలు పాల్గొన్నారు.



## తెలంగాణ సీఎంగా సీతక్క!

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 10)**

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తానా సభల్లో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ అంటే రేవంత్.. రేవంత్ అంటే కాంగ్రెస్ అన్న ఆయన అదే వేదికగా మరో ఆసక్తికర వ్యాఖ్య చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్కను ముఖ్యమంత్రిగా చేస్తామని వ్యాఖ్యానించారు. పార్టీలో బీసీ డిక్లరేషన్ పై చిచ్చు రేగుతున్న వేళ రేవంత్ వ్యాఖ్యలు దుమారం రేపే అవకాశాలు ఉన్నాయి. అమెరికాలో జరుగుతున్న తానా సభల్లో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీఎం ఎవరనే విషయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే ములుగు ఎమ్మెల్యే సీతక్కను సీఎంగా చేస్తామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారాన్ని చేపడితే దళితులు, గిరిజనులకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని కొంతమంది ఎన్నారైలు రేవంత్‌ను కోరారు. ఈ సందర్భంగా సీతక్కకు సీఎం పదవి గురించి వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు.

## భట్టితో జూపల్లి భేటీ

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 10)**

కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో మాజీ మంత్రి జూపల్లి కృష్ణా రావు భేటీ అయ్యారు. సోమవారం ఉదయం భట్టి నివాసానికి చేరుకున్న ఆయన... కొద్దిసేపు సీఎల్పీ నేతతో ముచ్చటించారు. పాదయాత్ర విజయవంతపై భట్టికి జూపల్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జూపల్లి మీడియాతో మాట్లాడుతూ... కొల్లాపూర్‌లో జరగబోయే బహిరంగ సభకు రావాలని భట్టిని కోరినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై అనేక విషయాలు యాత్రలో తెలుసుకున్నట్లు భట్టి చెప్పారన్నారు. సభకు జాతీయ నేతలు రాబోతున్నారని.. సభను సక్సెస్ చెయ్యాలని చూస్తున్నామన్నారు. జూపల్లి కాంగ్రెస్‌లో చేరుతున్నందుకు ధన్యవాదాలు అని భట్టి అన్నారు. జూపల్లి చేరిక పార్టీకి, రాష్ట్రానికి ఉపయోగపడుతుందన్నారు. చేరిక సమయంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని.. సభ ద్వారా తెలంగాణ సమాజానికి ఓ మెసేజ్ వెళ్లనుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నేతలు క్యాడర్ కదిలిరావాలని పిలుపునిచ్చారు.

